క్లుప్తంగా

ముచ్చర్లలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం రూరల్: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో చేరిన తహసీల్దార్



తహసీల్దార్‌ను అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

బొండపల్లి: మండల తహసీల్దార్‌గా డీఎస్‌జీఎన్ ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తవలస మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన శ్రీనివాస్ మిశ్రా కొత్తవలస మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సీఎస్‌డీటీ రవిశంకర్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, సర్వేయర్ శివ, ఆర్ఐ, వీఆర్వోలు అభినందనలు తెలియజేశారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

గుర్ల: మండలంలోని గుజ్జింగివలసలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ రెడ్డి పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అప్పలనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి పనులను పర్యవేక్షించారు.

ఆహ్వానం



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఆహ్వానం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు శుక్రవారం ఆహ్వాన పత్రాలు అందజేశారు.

శ్రీనివాసుడికి గరుడ సేవోత్సవం



గరుడ వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి స్వామివారికి గరుడసేవ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పైడితల్లికి పింఛను అందజేస్తున్న వలంటీర్ రామలక్ష్మి

గంట్యాడ: మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన తెంటు పైడితల్లి అనే వృద్ధుడు అనారోగ్యంతో విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ టేకు రామలక్ష్మి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది. సేవల పట్ల ఆమెకు ఉన్న చిత్తశుద్ధిని పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందిస్తున్నారు.

జగనన్న పాలనలో..

గడప గడపలో సంతోషం



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దేసుపాత్రునిపాలెం గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు, అధికారులు, వలంటీర్లతో కలిసి గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రయత్నం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98.5 శాతం నెరవేర్చారని అన్నారు. కోవిడ్ విపత్కర సమయంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపించడంతో ప్రతిపక్షనేత చంద్రబాబు ఆల్ ఫ్రీ అంటూ బూటకపు ప్రచారాన్ని మొదలు పెట్టారన్నారు. ఆయన 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కనీసం 25శాతం కూడా నెరవేర్చలేదని, అందుకే 2019లో ప్రజలు టీడీపీని చిత్తుగా ఓడించారని అన్నారు. 2024లో ఎలాగైనా అధికారంలోకి వచ్చేందుకు మరోసారి మాయమాటలు చెపుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగన్న పాలనలో విద్యార్థులు, మహిళలు, రైతులు, ఉద్యోగులు అందరూ సంతోషంగా ఉన్నారని, ఈ సంతోషాలు ఇలాగే కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, సర్పంచ్ దలాయి లక్ష్మి, ఎంపీటీసీ కోరుబిల్లి లక్ష్మి, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, పీఎస్ఎన్ పాత్రుడు, దలాయి అప్పలరాజు, బొడ్డు అప్పారావు, ఏరువాక నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద్బాంధవులా ఆదుకుంటోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. లక్కవరపుకోట మండలం రంగారాయపురం గ్రామానికి చెందిన బుడుమూరి గాయత్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒక కాలును కోల్పోయింది. నిరుపేద అయిన ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.3.5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే శ్రీనివాసరావు శుక్రవారం బాధితురాలికి అందజేశారు. నియోజకవర్గ పరిధిలో గత నాలుగేళ్లలో వందలాది మందికి సీఎం సహాయ నిధి నుంచి కోట్లాది రూపాయలు సాయం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డేగల సాయిలక్ష్మి, పార్టీ నాయకులు సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న కెల్ల భీమారావు

మెరకముడిదాం: అంబేడ్కర్ ఆశయసాధనకే ఎయిమ్ సంస్థను ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్ స్థాపించారని ఎయిమ్ సంస్థ ప్రతినిధి కొలు చిరంజీవి అన్నారు. మండలంలోని రాచగుమడాంలో గురువారం రాత్రి విజయనగరం జిల్లా ఎయిమ్ సంస్థ కన్వీనర్ కెల్ల భీమారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 500 జనాభా ఉన్న ప్రతీ దళితవాడను ప్రభుత్వం ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. అలా చేసిన నాడే దళితవాడలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే దళితులంతా కలిసి ఎయిమ్ సంస్థను మరింత పటిష్టం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎయిమ్ లీగల్ అడ్వైజర్ ముచ్చరాము, సామంతుల రామస్వామి, ఆదినారాయణ, పుచ్చల గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధిలు, అధికారులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పార్టీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అచ్యుతాపురం, చుక్కపేటలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అర్హులైనా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మంచి జరిగితే ప్రజలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన బంగారునాయుడు, అప్పన్న బాబు, అప్పలరాజు, ఎంపీడీఓ కల్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ఊరేగింపు



హరిదాసు కీర్తనల నడుమ సీతాముల విగ్రహాల ఊరేగింపు

- కలశాలతో పాల్గొన్న వందలాది మంది మహిళా భక్తులు
- ఆకట్టుకున్న కోలాటం, చెక్క భజనలు
- పినతాడివాడలో ఆధ్యాత్మిక శోభ



మహిళల చెక్కభజన

డెంకాడ: హరిదాసుల కీర్తనలు, భక్తుల జై శ్రీరామ్ నామస్మరణ, మహిళల చెక్కభజన, కోలాటాల నడుమ మండలంలోని పినతాడివాడలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు కనులపండువగా శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరపూజతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. మండప పునఃపూజలు, సుందరాకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, మూలమంత్ర హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగాయి. సాయంత్రం సీతారాముల విగ్రహాలతో యాగశాల నుంచి బీసీ కాలనీ, పినతాడివాడ జంక్షన్ మీదుగా గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళా భక్తులు కలశాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే మహిళల చెక్క భజన, కోలాటం ప్రదర్శనలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది. కార్యక్రమాల్లో సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చుంనాయుడు, మాజీ సర్పంచ్‌లు పల్లె భాస్కరరావు, వాళ్లె సత్యవతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొర్నాన ఆదియ్య, లెంక రామారావు, ఉప సర్పంచ్ రేవళ్ల అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కన్వర్జెన్సీ సమావేశం

బొండపల్లి: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం పదిన్నర గంటలకు మండల ప్రత్యేక అధికారి ఎస్వీకే దుర్గా ప్రసాదరావు ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.వేదవతి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

జగనన్న కాలనీల్లో వెల్‌కం ఆర్చిల నిర్మాణం

గజపతినగరం రూరల్: వంద ఇళ్లకు పైగా ఉన్న జగనన్న కాలనీల్లో వెల్‌కమ్ ఆర్చ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు హౌసింగ్ ఏఈ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటివరకు పురిటిపెంట, గజపతినగరం కాలనీల్లో వందకు పైగా నిర్మాణాలు పూర్తయినట్లు చెప్పారు. ఆయా కాలనీల్లో త్వరలోనే ఆర్చిలను నిర్మించనున్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు 5 వరకు అవకాశం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశాలకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఉతీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 5వ తేదీలోగా అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపాల్ టి.జయశ్రీ తెలిపారు. శుక్రవారం నాటికి ఇంటర్మీడియట్‌లో 44 మంది, 5వ తరగతిలో నలుగురు విద్యార్థులు మాత్రమే జాయిన్ అయినట్లు చెప్పారు. విద్యార్థులు గడువు తేదీలోగా పాఠశాలలో చేరకపోతే సీటు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

8న వైస్ ఎంపీపీ ఎన్నిక

లక్కవరపుకోట: మండల పరిషత్ 2వ వైస్ ఎంపీపీ ఎన్నిక ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెండో వైస్ ఎంపీపీగా ఎన్నికైన జి.కుమారి ఆకాల మరణంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ఎంపీటీసీలు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఆరుగురు కానిస్టేబుళ్లకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆరుగురు కానిస్టేబుళ్లకు బదిలీ అయినట్లు ఎస్సై జి.శిరీష శుక్రవారం తెలిపారు. ముగ్గురికి విజయనగరం బదిలీ కాగా, చీపురుపల్లి, రామభద్రాపురం, గజపతినగరం మండలాలకు మరో ముగ్గురు బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. వారి స్థానంలో కొత్త వారు రావాల్సి ఉందన్నారు.

ఆర్ఐ, వీఆర్వో బదిలీ

దత్తిరాజేరు: మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ గౌరినాయుడుకు మెరకముడిదాం బదిలీ అయినట్లు తహసీల్దార్ రమేష్ శుక్రవారం తెలిపారు. ఆయన స్థానంలో బొబ్బిలి ఆర్డీఓ కార్యాలంలో పని చేస్తున్న రామ్ కుమార్ వస్తున్నట్లు చెప్పారు. అలాగే వంగర గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వీఆర్వో రవి గంట్యాడ మండలం బోనంగి సచివాలయానికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో గజపతినగరం నుంచి సింహాచలం రానున్నట్లు చెప్పారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా టీవీ గిరి

విజయనగరం రూరల్: విజయనగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్‌గా టీవీ గిరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీతంపేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎం.గోపాలకృష్ణను సీతంపేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అలాగే ఇక్కడ శిక్షణాధికారిగా పనిచేసిన శ్రీనివాసరావును విశాఖ జిల్లా గాజువాక ఐటీఐకి బదిలీ చేశారు.

ఆటోస్టాండ్ ప్రారంభం

విజయనగరం ఫూల్‌బాగ్: ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పడి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక గుంకలాం జగనన్న కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోస్టాండ్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి బి. రమణ, ఎ. జగన్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

- వలంటీర్లకు వందనం



పోరలిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దత్తిరాజేరు: గడప గడపకు వెళ్లి అర్హులకు పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జిల్లా బీసీ సెల్ చైర్మన్ మంత్రి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని టి.భూర్జవలస, పోరలి సచివాలయాల్లో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్‌లు మంత్రి క్రాంతికుమార్, మిత్తిరెడ్డి ధనలక్ష్మి, సాలాపు లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బోగస్ మస్తర్లు నమోదు చేస్తే చర్యలు



బీమవరం చాకలి కోనేరులో వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ

మెరకముడిదాం: ఉపాధి పనులకు హాజరై మస్తర్లు వేయించుకొన్న తరువాత కొందరు వేతనదారులు ఏవో కారణాలు చెప్పి వెళ్లిపోతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలా ఎక్కడైనా జరిగినట్టు తాము గుర్తిస్తే సంబంధిత క్షేత్రసహాయకుడిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉపాధిహామీ ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు హెచ్చరించారు. మండలంలోని భీమవరం, రాచగుమడాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. భీమవరంలో చాకలి కోనేరులో రూ.7.70 లక్షల వ్యయంతో, రాచగుమడాం ధర్మ కోనేరులో రూ.9.60 లక్షల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వేతనదారుల మస్తర్లను పరిశీలించి వారితో మాట్లాడారు. నాణ్యతతో పనులు చేపట్టాలని, సమయపాలన పాటించాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు పూర్తిచేస్తే గరిష్టంగా రూ.272లు వేతనం పొందవచ్చని అన్నారు.

వంతెన మరమ్మతులు చేపట్టాలని వినతి



ఆర్అండ్‌బీ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జామి: జామి–కొట్టాం మధ్య ఉన్న వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆర్అండ్‌బీ ఈఈ రమణకు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా వంతెన మీదుగా భారీ వాహనాలు రాకపోకలు చేయడం వల్ల వంతెన పాడైందని అన్నారు. ఈ వంతెన మీదుగా సుమారు 15 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రోడ్డు బాగుచేయాలని ధర్నా..

జామి: గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనుల కారణంగా జామి–కొట్టాం వంతెనతో పాటు రహదారి పూర్తిగా పాడయ్యిందని, అధికారులు వెంటనే వంతెన, రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుకు రాకపోకలు లేకుండా గోడ నిర్మించడం వల్ల రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలులేకుండా పోయిందని వాపోయారు. తక్షణమే సర్వీస్ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన రక్షణగోడను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐ.త్రివేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్

గజపతినగరం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో ఏపీ ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేసేందుకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంది వెంటకరమణ, గజపతినగరం తాలూకా అధ్యక్షుడు పి.సుధాకర్ పటానాయక్, గౌరవాధ్యక్షుడు సింహాచలం, కన్వీనర్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



చంద్రంపేటలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చంద్రంపేటలో రూ.8.40 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రహదారులు, కాలువలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు లాంటివన్నారు. గత పాలకులు రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలతోనే సరిపెట్టారని, నేడు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేసి శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో రైతు భరోసా, సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి.. ఉన్న గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ కర్రోతు అప్పలకొండ, ఎంపీటీసీ సభ్యురాలు వాల్లే లక్ష్మి, ఎంపీడీఓ గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.